

కొత్తపేట ఎస్సీ బాలికల వసతిగృహంలో చదువుకుంటున్న విద్యార్థినులు

మా వల్ల కాదు

- 11 నెలలుగా మెనూ బిల్లులు, 5 నెలలుగా కాస్మోటిక్స్ చార్జీలు పెండింగ్
- అప్పుల కోసం వార్డెన్ల పరుగులు
- నిర్వహించలేమని గగ్గోలు



కొత్తపేట, జూలై 18: పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు వసతితో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించి వారందరూ చదువుకునేందుకు నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్లు గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. నేడు నిర్వహణా భారంతో కొట్టుమిట్టాడుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సంబంధించి 33 ఎస్సీ హాస్టళ్లు, 22 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబరు నుంచి నేటి వరకు మెనూ బిల్లు ఒక్క రూపాయి చెల్లించలేదు. దాంతో పాటు విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్స్ ఛార్జీలు కూడా ఐదు నెలలుగా పెండింగులో ఉండడంతో వారు బడికి వెళ్లేందుకు సిద్ధమవ్వడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక సరుకులు ఇచ్చేందుకు కిరాణా వ్యాపారులు నిరాకరిస్తుండటంతో అప్పుల కోసం పరుగులు పెట్టాల్సి వస్తోందని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి దాదాపు ఇలానే ఉండడంతో నిర్వహణ భారమైందని వారు గగ్గోలు పెడుతున్నారు.

కొత్తపేట మండలానికి సంబంధించి ఒక బీసీ, ఒక ఎస్సీ బాలురు, ఒక ఎస్సీ బాలికల హాస్టల్ వున్నాయి. అయితే విద్యార్థులు అంతంతమాత్రంగానే ఉండటంతో బీసీ హాస్టల్‌ను మూసేశారు. మిగతా రెండింటినీ నిర్వహిస్తున్నారు. వాటిల్లో బీసీ, ఓసీ విద్యార్థులకు పర్సంటేజీ పద్ధతిలో ప్రవేశం కల్పిస్తున్నారు. కొత్తపేట ఎస్సీ బాలుర హాస్టల్‌లో 150 మంది, బాలిక హాస్టల్‌లో 110 మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారు. బాలికల హాస్టల్‌లో మాత్రం చాపలు కూడా లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.15లక్షలు, బాలికల హాస్టల్‌కు రూ.8 లక్షలు మెను బిల్లులు పెండింగులో ఉన్నట్టు తెలుస్తోంది. వ్యాపారులకు అప్పులు లక్షల్లో చెల్లించాల్సి ఉండడంతో తమకు కావాల్సిన సామగ్రి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని... అయినా విద్యార్థులకు ఆహారం అందించడం కోసం వారిని బతిమాలుతున్నామని వార్డెన్లు చెప్తున్నారు.

బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

జి.పవన్‌కుమార్, ఎం.హేమలత, వార్డెన్లు

లక్షలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి



మండపేటలో జోరుగా కురుస్తున్న వర్షం

కుండపోత

- జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు
- గురువారం ఉదయం నుంచీ ఎడతెరిపి లేని వాన
- పల్లపు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన వరి నారుమడులు
- గోదావరికి పోటెత్తుతున్న వరద
- అత్యధికంగా మండపేటలో 109 మిల్లీమీటర్ల వర్షపాతం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. రబీ సాగుకు సంబంధించి వేసిన నారుమడులు నీట మునిగాయి. రైతులు చేసుకుంటున్న వరి పనులకు వర్షం ఆటంకంగా మారింది. గురువారం జిల్లాలో అత్యధికంగా మండపేటలో 109.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అల్లవరంలో 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా మండపేట పట్టణం, పరిసర ప్రాంతాలన్నీ జలదిగ్బంధానికి గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మరోవైపు గోదావరి నదీపాయలకు వరద పోటెత్తుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద ఉధృతి కారణంగా వశిష్ఠ నదిపై జి.పెదపూడి వద్ద నదీపాయపై వేసిన గట్టు తెగిపోయింది. ఈ కారణంగా పరిసర ప్రాంతాల లంక ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. గత రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో ప్రధానమైన మేజర్, మైనర్ డ్రెయిన్లలో నీరు నిలిచిపోవడం వల్ల పరిసర పంట పొలాల్లోకి ముంపునీరు చేరి రైతులు పాట్లు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వరి నారుమడులు వర్షపు నీటిలో మునిగిపోయాయి. రెండు లేదా మూడు రోజుల్లో నీరు దిగకపోతే నారుమడులకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్వేది ఆలయ సమీపానికి గోదావరి, చెరువుల్లో నీరు పోటెత్తడంతో చేపలు సైతం రోడ్లపైకి వచ్చాయి. వాటిని పట్టుకునేందుకుస్థానికులు వలలతో పోటీపడ్డారు. మరోవైపు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాల ఉధృతితో తీర ప్రాంతం భారీగా కోతకు గురవుతోంది. ఇదిలా ఉండగా గోదావరి నదికి వరద ప్రభావం పొంచి ఉంది. దాంతో అటు భద్రాచలం, ఇటు ధవళేశ్వరం వద్ద వరద నీటిమట్టం క్రమంగా పెరుగుతుండడంతో సముద్రంలోకి లక్షలాది క్యూసెక్కుల నీటిని వదిలారు. ఫలితంగా కోనసీమలోని గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమి నదీపాయల్లో వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. రానున్న రెండు రోజుల్లో కూడా వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు అధికారులు అప్రమత్తతతో ఉండాలని సూచించారు.

జిల్లాలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షపాతం వివరాలు మండలాల వారీగా (మిల్లీమీటర్లలో) ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం 48.8, రాయవరం 57, రామచంద్రపురం 70.2, ఆలమూరు 52.4, రావులపాలెం 36.8, కొత్తపేట 33.2, కె.గంగవరం 69.4, ఐ.పోలవరం 77, ముమ్మిడివరం 57, అయినవిల్లి 42, పి.గన్నవరం 27.8, అంబాజీపేటలో 41.8, మామిడికుదురు 23.6, రాజోలు 25.2, మలికిపురం35.4, సఖినేటిపల్లి 39.6, అమలాపురం 27.2, ఉప్పలగుప్తం 25.6, కాట్రేనికోన 53.8.



భారీ వర్షం కారణంగా మామిడికుదురు మండలం పాశర్లపూడిలోని జాతీయ రహదారిపై ఏర్పడిన గోతుల్లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ముంపు బారిన వరి పొలాలు

- సస్యరక్షణ చర్యలు చేపట్టండిలా....
- రైతులకు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ సూచనలు

ముమ్మిడివరం, జూలై 18: అల్పపీడనం కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు ముంపు బారిన పడి నష్టపోయే ప్రమాదం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ రైతులకు సూచించారు.

- నారుమడి దశలో ఉన్న వాటికి విత్తనం చల్లి రెండు, మూడు రోజులైతే వాటిని మూడు రోజులు కన్నా ఎక్కువగా నీటిలో మునిగి ఉంటే మొలక శాతం దెబ్బతింటుంది.
- నారుమడిలో నీటిని వీలైనంత త్వరగా పూర్తిగా బయటికి తీసివేయాలి. దీనివల్ల విత్తనానికి గాలి తగిలి మొలక త్వరగా వస్తుంది.
- విత్తనం చల్లి 7 నుంచి 30 రోజుల మధ్య ఉన్నా, నారుమడి ఐదు రోజులు కన్నా ఎక్కువ నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది.
- ఐదు రోజులలోపు నీటిని పూర్తిగా బయటకి తీసివేసి గాలి తగిలేలా చూసుకోవాలి.
- ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.
- వర్షాల వల్ల నారుమడిని తెగుళ్లు ఎక్కువ ఆశించే అవకాశం ఉంది. నీటిని పూర్తిగా బయటికి తీసివేసిన తర్వాత మొక్క నిలదొక్కుకున్న అనంతరం తెగుళ్ల నివారణకు ఒక గ్రాము కార్బండిజం లేదా రెండు గ్రాముల కార్బండిజంతో పాటు పాటు మ్యాంకోజెబ్ మిశ్రమాన్ని లీటరు నీటికి పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.
- ఊడ్చిన వెంటనే పిలకల దశలో ఉంటే ముంపునకు గురైన నీటిని పూర్తిగా బయటికి తీసేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి.
- నీటిని పూర్తిగా తీయడానికి వీలుపడని పక్షంలో పైరుపై రెండు శాతం యూరియా, పొటాషియం నైట్రేట్ పిచికారీ చేసుకోవాలి. దీనివల్ల త్వరగా పైరు పుంజుకుంటుంది. వరి పైరు పూర్తిగా కోలుకున్న తర్వాత మాగుడు, ఇతర తెగుళ్ల రాకుండా కార్బండిజం ఒక గ్రాము, మ్యాంకోజెబ్ మిశ్రమం 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.
- విత్తనం వెదజల్లిన వరి పొలాల్లో అధిక వర్షాల వల్ల విత్తనాలు కుప్పలుగా పోగులు పడి, గింజలు లోతుకు వెళ్లి పైన మట్టి కప్పడం వల్ల నీరు తీయని పరిస్థితుల్లో ఉంటే మొలక శాతం దెబ్బతింటుంది.
- రైతులు వర్షాలుగా తగ్గిన వెంటనే నీరు బయటికి పోవడానికి కాల్వలు ఏర్పాటుచేసుకుని వీలైనంత త్వరగా నీటిని పూర్తిగా బయటికి తీసివేయాలి. దీనివల్ల విత్తనం త్వరగా మొలకెత్తుతుంది.
- విత్తనం చల్లి 10 నుంచి 30 రోజుల మధ్య వయసుంటే ఆ పొలం ఐదు రోజులు కన్నా ఎక్కువ రోజులు నీట మునిగి ఉంటే పైరు దెబ్బతినే అవకాశం ఉంది.
- నీటిని పూర్తిగా బయటికి తీసివేసి పైరుకు గాలి తగిలేలా చేయాలి.
- ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి.
- నీటిని తీయలేని పరిస్థితిలో 2 శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేసుకుంటే పైరు త్వరగా కోలుకుంటుంది.
- వరి పంట కోలుకున్న తర్వాత తెగుళ్ల వ్యాప్తి నివారణకు ఒక గ్రాము కార్బండిజం లేదా 2 గ్రాముల కార్బండిజంతో పాటు మ్యాంకోజెబ్ మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.





మామిడికుదురు, ముమ్మిడివరంల్లో నీట మునిగిన వరి నారుమడులు

డ్రోన్ల వినియోగంతో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- డీఆర్డీఏ పీడీ శివశంకర ప్రసాద్
- డ్రోన్ల వినియోగంపై మహిళలకు శిక్షణ

ముమ్మిడివరం, జూలై 18: డ్రోన్ వినియోగించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శివశంకరప్రసాద్ కోరారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నమో డ్రోన్ దీదీ పథకం భైర్రాజుఫౌండేషన్ సహకారంతో ముమ్మిడివరంలోని డీఆర్డీఏ కార్యాలయంలో డ్రోన్ల వినియోగంపై జిల్లాలోని డ్వాక్రా మహిళలకు గురువారం ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శివశంకరప్రసాద్ మాట్లాడుతూ వరి పంటపై పురుగులు, మందులు, ఎరువులు పిచికారీ చేయడానికి, చేపలు, రొయ్యల చెరువుల్లో మందులు చల్లడానికి, చేపలు, రొయ్యల వ్యాధులను గుర్తించడానికి, వరి పంట ఎదుగుదల... ఇతర విషయాలపై ఇతర విషయాలు తెలుసుకునేందుకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు చేపట్టిడ్వాక్రా మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉందన్నారు. డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు ఉంటుందని... సబ్సిడీ రూ.8లక్షలు పోగా రూ.2లక్షలు బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. డ్రోన్ కొనుగోలుకు 80 శాతం సబ్సిడీతో గ్రూపు రుణాలు ఏర్పాటు చేయడంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మహిళా సంఘాల నుంచి కనీసం పదో తరగతి చదివిన మహిళలను ఈ సదస్సుకు ఆహ్వానించామన్నారు. ఒక్కో గ్రూపు నుంచి కనీసం ఇద్దరిని పిలిచామన్నారు. హైదరాబాద్ జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆపరేటర్లు రాకేష్, సతీష్ డ్రోన్ ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్‌జీపీ విజయవాడకు చెందిన చంద్రమౌళి డ్రోన్ పథకం పొందడానికి అర్హతలు, రిజిస్ట్రేషన్ విధానాన్ని వివరించారు. డీఆర్డీఏ ఏపీడీ ఎంఎం జిలానీ, డీసీఎం వినయ్, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి పి.లోకమాన్, భైర్రాజు ఫౌండేషన్ ప్రతినిధి ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఆపరేటర్లు రాకేష్, సతీష్...
అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ భూసేకరణ త్వరితగతిన చేపట్టాలి

- రెవెన్యూ, రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి విజయవాడకు ప్రత్యామ్నాయ మార్గంగా కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కాకినాడ నుంచి విజయవాడకు ప్రత్యామ్నాయ ఎలక్ట్రిఫైడ్ రైలు మార్గంగా ఏర్పడుతుందన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రైల్వే, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రైల్వే భూసేకరణ అంశంపై ప్రధానంగా చర్చించారు. అమలాపురం నుంచి నర్సాపురం వరకు రైల్వే లైన్ నిర్మాణం కోసం భూసేకరణ సర్వేను రైల్వే, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చేపట్టాలని, ఎటువంటి జాప్యానికి తావు ఇవ్వకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఉత్పన్నమయ్యే సమస్యలను కలెక్టర్, ఆర్డీవో, సంబంధిత తహసీల్దార్లు సమన్వయంతో వాటిని పరిష్కరించాలన్నారు. ఈ నిర్మాణంలో ఏర్పడుతున్న అనేక సమస్యలను రైల్వే అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కోటిపల్లి నుంచి అమలాపురం వరకు భూ సేకరణ పూర్తయినప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో మ్యూటేషన్ ప్రక్రియ చేయాలని రైల్వే అధికారులు కోరారు. అమలాపురం నుంచి నర్సాపురం వరకు భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో భూస్వాముల నుంచి వస్తున్న అభ్యంతరాలను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, మరో అధికారి రామలింగరాజు, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న జేసీ నుపూర్‌అజయ్

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, జూలై 18: జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీకి జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ఆధ్వర్యంలో గురువారం ముఖాముఖి ఇంటర్వ్యూలు జరిగాయి. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పోస్టుకు 21 మంది, ఒక ప్రొటెక్షన్ అధికారి పోస్టుకు 35 మంది, నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్ పోస్టుకు 34 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక కౌన్సిలర్ పోస్టుకు 18 మంది, 2 సోషల్ వర్కర్ల పోస్టులకు 44 మంది, డేటా ఎనలిస్టు పోస్టుకు 28 మంది, ఒక అసిస్టెంట్ డీఈవో పోస్టుకు 23 మంది, ఒక అవుట్‌రీచ్ వర్కర్ పోస్టుకు 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఐసీడీఎస్ పథక సంచాలకురాలు ఎం.ఝాన్సీరాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ సూర్యప్రభావతి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు తబిత, సాంఘిక సంక్షేమ ఉప సంచాలకురాలు జ్యోతిలక్ష్మీదేవి పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం

అమలాపురం టౌన్, జూలై 18: సురక్షిత ప్రయాణానికి వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ సూచించారు. రహదారి భద్రతపై పాదచారులు, వాహనచోదకులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గురువారం అమలాపురం కోర్టు ప్రాంగణం నుంచి గడియార స్తంభం సెంటరు వరకు రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్ జెండా ఊపి ప్రారంభించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారంతా హెల్మెట్ విధిగా ధరించాలని కోరారు. ప్రధాన కూడళ్ల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాలీలో ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, డీఎస్పీ మహేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం టౌన్, జూలై 18: కోనసీమ జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వ్యాధుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నియంత్రణ కార్యక్రమాలపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన చర్యలపై ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని విజ్ఞప్తి చేశారు. డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గురువారం ప్రారంభించిన సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. ఇందు కోసం జిల్లాలో 1,422 బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వ్యాధిని ముందుగా గుర్తించడం వల్ల చికిత్స ద్వారా నయం చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి, డాక్టర్ సుమలత, డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డీఐవో సత్యనారాయణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరం మండలం గంటిపెదపూడి బూరుగులంక వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

రోడ్డుపైకి చేపలు..



అంతర్వేది, జూలై 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేది ఆలయ రహదారుల్లో వర్షపు నీటికి చేపలు బయటకు వచ్చేశాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో స్వామివారి సన్నిధికి దర్శనానికి వచ్చిన భక్తులు చేపలను చూసేందుకు ఉత్సాహపడ్డారు. స్థానిక యువకులు వలలతో రోడ్డుపై పొంగి పొర్లుతున్న నీటిలో ఎదురీదుతున్న చేపలను పట్టుకున్నారు. తాడేపల్లి గూడానికు చెందిన కొంతమంది భక్తులు దర్శనం అనంతరం సుమారు 50 కిలోల జల్లలు, గొరకలను పట్టుకున్నారు. ఈ చేపల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి.



చేపలు పడుతున్న స్థానికులు

కూనవరంలో కుండపోత



వాగులో చిక్కుకున్న ఉపాధి కూలీలు

కూనవరం, జూలై 18: కూనవరం మండలంలో కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, చెరువులు జలమయమయ్యాయి. మండలంలో 8.5 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. మండలంలోని టేకులబోరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా బోదునూరు అడవుల్లో ఒక్కసారిగా వాగులు పొంగడంతో చిక్కుకున్నారు. ప్రాణభయంతో ఒకరి చేయి ఒకరు పట్టుకొని బయటపడ్డారు.

జోరు వాన

ప్రవహిస్తున్న వాగులు,వంకలు.. తెగిపోయిన రోడ్లు..జనజీవనం అస్తవ్యస్తం

వాగుల ఉధృతి

వరరామచంద్రాపురం, జూలై 18: గురువారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు నిండి పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిలో ఉన్న అన్నవరం వాగు చప్టా పైనుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో మండల కేంద్రానికి రావడానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద కూడా క్రమేపీ పెరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.



వరరామచంద్రపురం: అన్నవరం చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు



గండిపోశమ్మ ఆలయాన్ని ముంచెత్తిన వరద నీరు

పోటెత్తిన గోదావరి

దేవీపట్నం, జూలై 18: అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో గోదావరి పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు, కచ్చులూరు, గొందూరు, మంటూరు, మూలపాడు, అగ్రహారం, తొయ్యేరు, పూడిపల్లి, పోశమ్మగండి తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని గురువారం వరదనీరు చుట్టుముట్టడంతో అమ్మవారి విగ్రహం సగం వరకు నీట మునిగింది. దీంతో తాత్కాలికంగా అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. అలాగే పాపికొండలు విహారయాత్రను గత రెండు రోజుల నుంచి నిలుపుదల చేశారు. దండంగి వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వరదనీరు ఎక్కువగా చేరడంతో వాగుకు అటువైపు ఉన్న చొప్పకొండ, గంగవరం, దామనపల్లి, కె.రామన్న పాలెం, మద్దిరాతిగూడెం తదితర గ్రామాలకు ప్రభుత్వ కార్యాలయాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం నుంచి వర్షం అధికంగా కురవడంతో వాగులు పొంగి ప్రవహించి జనజీవనం స్తంభించింది. అలాగే ఎటపాక మండలం చింతలచెరువు గ్రామంలో వరదనీటికి రహదారి కొట్టుకుపోయింది. నల్లకుంట-గౌరీదేవిపేట గ్రామాల మధ్యలో రహదారిపై వరద ఉధృతి ఎక్కువవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఎటపాక, జూలై 18: ఏజెన్సీలో ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా కుండపోతగా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. వర్షం ధాటికి కృష్ణవరం పంచాయతీలోని చింతలచెరువు గ్రామం వెళ్లే ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. రహదారికి ఇరువైపులా దెబ్బతింది. దీంతో ఇటు వైపు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లకుంట-గౌరీదేవిపేట గ్రామాల మధ్యలో కల్వర్టు సమీపంలో రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ గ్రామాలకు మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచాయి. భారీ వర్షానికి కృష్ణవరం గ్రామ శివారులోని కల్వర్టు ప్రాంతం వద్ద రహదారిని వరదనీరు ముంచెత్తింది. రహదారిపై ఉధృతంగా వరద ప్రవహించింది. దీంతో గిరిజనులు నడుములోతు నీటిలో ప్రమాదపు అంచున రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు భారీ వర్షం ధాటికి అనేక గ్రామాల్లో వరదనీరు రహదారిపై ప్రవహిస్తూ, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనిచోట వరదనీరు ఇళ్లలోకి చేరింది. భారీ వర్షానికి ప్రాజెక్టులు, చెరువులు, పంట పొలాలు నిండిపోయాయి. భారీ వర్షం ధాటికి ప్రజల దైనందిన జీవితానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది.

తెగిపోయిన ప్రధాన రహదారి



కృష్ణవరం గ్రామ శివారులో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

లంక గ్రామాల వైపు వరదనీరు



బూరుగులంక నదీపాయలో గోదారి పరవళ్లు

పి.గన్నవరం, జూలై 18: గోదావరి నది ఎగువన వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నెమ్మదిగా పెరుగుతోంది. భద్రాచలంలో నీటి మట్టం పెరుగుతుండడంతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో కోనసీమ జిల్లాలోని గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయలకు వరద తాకిడి మొదలైంది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి, ఉడిమూడికి చెందిన నాలుగు లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు బూరుగులంక నదీపాయ వద్ద ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి గురువారం సాయంత్రం వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయింది. ఆ సమయంలో రాకాసి అలలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గట్టుపైకి నీరు ప్రవహించిన అర గంటలోనే గట్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో గంటి పెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఎర్ర నీరు పోయి తెలుపు నీరు వచ్చే వరకు నాలుగు నెలల పాటు లంక గ్రామస్తులు నాటు పడవలపైనే ప్రయాణం సాగించాల్సి ఉంది. తాత్కాలిక రహదారి కొట్టుకుపోతుందన్న ముందు జాగ్రత్తతో లంక గ్రామస్తులు తమ ద్విచక్ర వాహనాలను ఇవతలి ఒడ్డునే ఉంచేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నదీపాయను పరిశీలించి ఇంజను బోటుపై అవతలి ఒడ్డుకు వెళ్లి తక్షణం చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు.

రెండు ఇంజన్ బోట్లు ఏర్పాటు చేశాం

ఎస్‌కే హుస్సేన్, తహసీల్దారు

గంటి పెదపూడి శివారు బూరుగులంక వద్ద వరద ప్రవాహంలో తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో లంక గ్రామాల ప్రజల రాకపోకల నిమిత్తం రెండు ఇంజన్ పడవలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. ఎస్‌ఐ బి.శివకృష్ణతో కలిసి ఆయన నదీపాయను పరిశీలించారు. రక్షణ నిమిత్తం లైఫ్ జాకెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నదీపాయ వద్ద రెవెన్యూ సిబ్బందితో పాటు పోలీసులు కూడా ఉండేలా ఆదేశాలు జారీ చేసామని చెప్పారు.

హుండీ చోరీ కేసులో ఇద్దరు మైనర్లతో సహా ముగ్గురి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 18: ఆలయంలోని హుండీ చోరీ కేసులో ఇద్దరు మైనర్లు సహా ముగ్గురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. గొల్లప్రోలు పట్టణంలోని రాయవరం రోడ్డులో వినాయక ఆలయం తలుపులు, హుండీ బద్దలు కొట్టి నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ చోరీకి పాల్పడిన పిఠాపురం మండలం కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానందపాల్(20)తో పాటు పిఠాపురం పట్టణానికి చెందిన 15, 16 సంవత్సరాలు వయస్సు కలిగిన ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి రూ. 1070 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ జానీబాషా తెలిపారు.

నన్నయ ఇన్‌చార్జి వీసీగా శ్రీనివాసరావు



దివాన్‌చెరువు, జూలై 18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య వై.శ్రీనివాసరావును నియమిస్తూ గురువారం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నన్నయ విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు. తనపై ఉన్న నమ్మకంతో వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమించిన గవర్నర్, యూనివర్సిటీ కులపతి అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి త్రికరణశుద్ధిగా పనిచేస్తానన్నారు.

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీగా మురళీకృష్ణ



మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 18: ఏపీలోని 17 జేఎన్టీయూకే ఓడీఎల్, ఓఎల్ డైరెక్టర్, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణను జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. ఆయన గతంలో అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్‌గాను, యూసీఈఎన్ ప్రిన్సిపాల్‌గాను విధులు నిర్వహించారు. 2015లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాధించారు. ఆయన రచించిన 120 పేపర్లు ప్రచురణ కాగా 27 పుస్తకాలకు ఆథర్‌గా వ్యవహరించారు. జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ ఉపకులపతిగా నియమితులయ్యారు. ఆయన గతంలో డీఈగాను, డీఏపీగాను, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు.

విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

శంఖవరం, జూలై 18: విద్యుత్ తీగ తగిలి శంఖవరం గ్రామానికి చెందిన కోన వీరలోవకుమార్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... మేకల మేతకు వెళ్లిన కుమార్ చెట్టు కొమ్మను కర్రకు కట్టి కత్తితో నరకుతుండగా కత్తి కర్ర విద్యుత్ తీగకు తగిలింది. దీంతో కుమార్ విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని దుర్మరణం



సామర్లకోట, జూలై 18: సామర్లకోట-హుస్సేన్‌పురం కెనాల్ రోడ్‌లో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న జి.మేడపాడుకు చెందిన గోనుపూడి రాజు(35) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు తన భార్య సునీతతో కలిసి సామర్లకోటకు వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై సామర్లకోట నుంచి జి.మేడపాడుకు వెళుతుండగా హుస్సేన్‌పురం సమీపించేసరికి రోడ్డు పక్క వేచి ఉన్న శిరీషను మోటార్‌సైకిల్ ఎక్కించుకునేందుకు ఆగడంతో అదే సమయంలో వెనుక నుంచి లారీ అతివేగంగా మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరమేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం



గొల్లప్రోలు రూరల్, జూలై 18: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ గురువారం దుర్గాడ శివాలయంలో సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని శివాలయం మరోమారు సహస్ర ఘటాభిషేకానికి వేదికగా నిలిచింది. 48 సంవత్సరాలుగా ప్రతి ఏటా తొలి ఏకాదశి మరుసటి రోజు ద్వాదశి పర్వదినాన క్రమం తప్పకుండా నిర్వహించే ఈ కార్యక్రమం గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగింది. గ్రామంలోని శివాలయంలో వేంచేసి ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని గ్రామస్తులు జలాలతో అభిషేకించారు. ముందుగా మహిళలు తమ ఇళ్ల నుంచి పసుపు జలాలు తీసుకువచ్చి స్వామిని అభిషేకించారు. తదనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేటి నుంచి నీటిని బిందెలతో తీసుకువచ్చి శివలింగం పూర్తిగా నిండేవరకూ అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. సహస్ర ఘటాభిషేకం జరుగుతున్నంతసేపు ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ఆధ్వర్యంలో ఆదిత్య శర్మ, షణ్ముఖశర్మ, కారుణ్య, కార్తీక్, రామకృష్ణ, ఫణి, దిలీప్ శర్మ సహస్ర ఘటాభిషేకం, మహాన్యాపూర్వకంగా 11 రుద్రాలతో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించగా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



బిందెలతో క్యూలో ఉన్న భక్తులు

లారీ ఢీకొనడంతో వృద్ధురాలి మృతి



అనంతలక్ష్మి

మండపేట, జూలై 18: లారీ ఢీకొనడంతో గురువారం ఓ వృద్ధురాలు మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట తర్వాణిపేటకు చెందిన ఇంటి అనంతలక్ష్మి (69) ద్వారపూడి పంచాయతీ పరిధి వేములపల్లిలో ఉన్న పరిశ్రమలో పనిచేస్తుంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గురువారం పరిశ్రమలో పని ముగించుకుని వస్తున్న ఆమెను రాజానగరం మండలం తుంగపాడు నుంచి ద్వారపూడి వైపు వస్తున్న విజయవాడకు చెందిన లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఏఎస్ఐ అప్పారావు తెలిపారు.

డీఎల్‌ఎంటీలకు శిక్షణ తరగతులు ప్రారంభం

సామర్లకోట, జూలై 18: గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో వివిధ అంశాలలో నిష్ణాతులైన అధికారులు అందించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ సూచించారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో గురువారం జిల్లా స్థాయి మాస్టర్ లెవెల్ (డీఎల్‌ఎంటీ) అభ్యర్థులకు మూడు రోజుల శిక్షణా తరగతులను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మూడురోజుల పాటు శిక్షణ పొందిన డీఎల్‌ఎంటీలు జిల్లాస్థాయిలో గ్రామాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజుల పాటు జరగనుండగా ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణా తరగతులు నిర్వహించనుండగా శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లాల వరకూ 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్యాకల్టీ జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ వివిధ అంశాలను వివరించారు. మొదటి రోజు శిక్షణా తరగతులకు 72 మంది హాజరయ్యారు.

జేఎన్టీయూకేలో ఐసీపీ కౌన్సెలింగ్




కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, జూలై 18: ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రాం(ఐసీపీ) కోర్సుల్లో సీట్ల భర్తీ సంబంధించిన కౌన్సెలింగ్‌ను గురువారం జేఎన్టీయూకేలోని సెనేట్‌హాల్లో వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏఎం ప్రసాద్, ఎఫ్‌యూఏఆర్ డైరెక్టర్ శివనాగరాజు, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటిగా ఐసీ డైరెక్టర్ గురుదత్ వేల్పుల ఐసీపీ కోర్సు గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్టీయూకేలోనూ చివరి మూడేళ్లు బీటీహెచ్ స్వీడన్‌లోనూ చదవాల్సి ఉంటుందన్నారు. 4వ ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాకా ప్రోగ్రాంనుంచి వైదొలిగే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ కోర్సుల్లో మొత్తం 60సీట్లు ఉండగా మొత్తం 73మంది దరఖాస్తు చేశారని అడ్మిషన్స్ డైరెక్టర్ ఏఎం ప్రసాద్ తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా సీఎస్ఈలో 5, ఏఐఎంఎల్‌లో 12, ఈసీఈలో రెండు సీట్లు భర్తీ అయ్యాయన్నారు. త్వరలో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించిన రెండోదశ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూలై 18: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి గురువారం గండి భరత్‌కుమార్ రెడ్డి లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాత ఆయనను అభినందించి స్వామివారి ప్రసాదం అందజేశారు.

వెంకన్న ఆలయానికి సెంట్రల్ ఏసీ బహూకరణ



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

ఆత్రేయపురం, జూలై 18: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి అంతరాలయం, గర్భాలయానికి రూ.19 లక్షల వ్యయంతో సెంట్రల్ ఎయిర్ కండిషనర్‌ను రాజమహేంద్రవరానికి చెందిన పోతల వేణుగోపాలరావు బహూకరించారు. దాతకు ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,64,588 లభించినట్టు ఈవో చెప్పారు.





పాటు చేస్తేనే పూట గడిచేది..

వానొచ్చినా.. వరదొచ్చినా.. రెక్కాడితే గానీ వారికి పూట గడవదు.. కడుపు నింపుకునేందుకు ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పనికి పోవాల్సిందే. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రోజంతా హోరున వాన..గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికలను దాటి ఉరకలు పెడుతోంది. అయినా లంకల్లో జీవనం సాగించే మత్స్యకారులకు మాత్రం వేట తప్పలేదు. గురువారం వారు వేటకు వెళుతున్న దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి'కి కనిపించాయి.

-రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

రేపు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, జూలై 18: ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఏర్పాటు చేసినట్టు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా చైర్మన్ల అధ్యక్షతన జరుగుతాయన్నారు. ఈ సమావేశాలకు స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఎంపీడీవో కుటుంబానికి న్యాయం చేయాలి

అల్లవరం, జూలై 18: ఫెర్రీవేలం పాటబాకీ సొమ్ము రాబట్టడంలో ఇబ్బందులతో మానసిక ఒత్తిడితో ఇంటి నుంచి వెళ్లిపోయిన నర్సాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణ ఆచూకి కనుగోనాలని కోనసీమ జిల్లా ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు బీఎస్ఎస్ కృష్ణమోహన్, సంఘ నాయకులు కోరారు. ఎంపీడీవో కుటుంబానికి న్యాయంచేయాలన్నారు. విధి నిర్వహణలో ఎంపీడీవోలకు రక్షణ, భద్రతకల్పించాలని కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి జి.వాణి, ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎ.శ్రీనివాస్ కోరారు.

- ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రహదారులు, పంట పొలాలు నీట మునక
- వర్షానికి పని లేక కూలీల ఇబ్బందులు

భారీ వర్షాలు.. పల్లపు ప్రాంతాలు మునక

ముమ్మిడివరం, జూలై 18: అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో వరి పొలాలు పలుచోట్ల నీట మునిగాయి. వేసిన నారుమడులు, నాట్లు వేసిన పొలాలు నీటమునిగాయి. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. వర్షాలకు మురుగునీటి కాల్వలు, పంటకాల్వలు పొంగి ప్రవహించడంతో ఎక్కడికక్కడ వర్షపు నీరు స్తంభించిపోయింది. మండలంలోని పలు లోతట్టు కాలనీలు, ఇంటర్నల్ రోడ్లు నీట మునిగాయి. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఎక్కడినీరు అక్కడ నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షంతో ప్రజాజీవనం స్తంభించిపోయింది.

కె.గంగవరం: బంగాళాఖాతంలో అల్పపీడనంతో గురువారం మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాల్లో నీరు నిలిచిపోయింది. పలు గ్రామాల్లో సీసీ రోడ్లపై వర్షం నీరు చేరింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మలికిపురం: మండల పరిధిలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

మామిడికుదురు: పాశర్లపూడిలోని జాతీయ రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొండాలమ్మ చింత నుంచి కైకాలపేట వరకు సుమారు ఒక కిలోమీటరు మేర రహదారి పెద్ద పెద్ద గోతులు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షం వస్తే ఈ గోతుల్లో వర్షపునీరు చేరి మరింత ప్రమాదకరంగా తయారై ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతులు పడిన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గురువారం ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు నారుమడులు నీట మునిగి తేలుతున్నాయి. సార్వా ఆరంభంలోనే వర్షాల వల్ల నారుమడులకు అపార నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. వాయుగుండం ప్రభావంతో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కొన్నిచోట్ల నారుమడుల్లోని మురిగినీరు తొలగించే ఆస్కారం లేదని అందువల్ల నారుమడులకు పూర్తిస్థాయి నష్టం ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నారుమడులను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. నగరంలోని జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



మండపేట గొల్లపుంత కాలనీలో వలస జీవులు ఏర్పాటుచేసుకున్న గుడారం వర్షం నీటిలో

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన జోరువానకు కాల్వలు, పంటబోదెలు పొంగి ప్రవహించాయి. మండలంలోని గ్రామాలు, కాలనీలు నీట మునిగాయి. అంతర్వేది తీర ప్రాంతంలో కొబ్బరి తోటల్లోకి వర్షం నీరు చేరి కాల్వలకు సమాంతరంగా నీరు చేరింది. సార్వా నారుమడులు వేసిన రైతులు జోరువానతో ఇక్కట్లకు గురవుతున్నారు. సార్వా ఊడ్చని చేలు చెరువులను తలపిస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామస్తులు ఉపాధిలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అంబాజీపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముంపు నీటితో ఉన్న రహదారులతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మండపేట: మండపేట పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. పట్టణంలో పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు ఛిద్రంగా మారాయి. పట్టణంలో ఎస్సీ కాలనీలో రోడ్లు, మండల పరిషత్ కార్యాలయంలో వర్షం నీటితో ముంపునకు గురైంది. ఎస్సీ కాలనీలోని పార్కు వర్షం నీటితో చెరువును తలపిస్తుంది. భారీ వర్షంతో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడ్డారు. మురుగుకాల్వలు, డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో సరఫరాకు అంతరాయం కలిగింది.

యానాం: యానాంలో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి వర్షం కురిసింది. దీంతో వర్షం నీటితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు పాఠశాలల సముదాయాలు, క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. ముంపు ప్రాంతాలను పరిపాలనాధికారి మునిస్వామి అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షంతో మూసుకుపోయిన డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలని అధికారులకు సూచించారు.

ఆలమూరు: అల్పపీడన ప్రభావంతో కురిసినభారీ వర్షంతో వరి నాట్లు నీట మునిగాయి. పినపళ్ల, ఆలమూరు, సంధిపూడి, పెదపళ్ల, గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో వరి నాట్లు ముంపుబారిన పడ్డాయని రైతులు వాపోతున్నారు. నారు లేక మళ్లీనాట్లు వేయడం కష్టమవుతుందని చెప్తున్నారు.

అల్లవరం: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అల్లవరం, రెల్లుగడ్డ, తూర్పులంక, గూడాల, తాడికోన తదితర గ్రామాల్లో వరి నారుమడులు నీట మునిగాయి. వరి పొలాలు జలశయాలుగా మారాయి. పలు కాలనీల్లో వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఓడలరేవు, దేవగుప్తం, గుండెపూడి రోడ్లు గోతులమయమై వాహనచోదకులు పాట్లు పడ్డారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం బండారు కాలనీలోని ఇళ్లను వర్షపు నీరు ముంచెత్తింది. పోలీస్‌స్టేషన్ వద్ద రహదారి జలమయమైంది. ముంపునీరు వెళ్లే మార్గంలేక పల్లపు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. పల్లపు పంట పొలాలు చెరువులనుతలపించాయి. మధ్య డెల్టా కాలువలకు ఇరిగేషన్ అధికారులు నీటిని తగ్గించడంతో ముంపునీరు కాలువలోకి వెళ్లింది.

రావులపాలెం: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచీ ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండటంతో నాట్లు వేసిన పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. రహదారులపై నీరు నిలిచిపోయింది. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

బతుకు చిత్రం

మండపేట, జూలై 18:పొట్ట కూటి కోసం వచ్చిన వలస జీవులు మండపేట గొల్లపుంత కాలనీలో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గురువారం కురిసిన భారీ వర్షాలకు మండపేటలో వారు ఏర్పాటు చేసుకున్న గుడారాలు వర్షం నీటిలో మునిగి కనిపించాయి.

చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జూలై 18: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యను ఆస్తిగా అందజేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సోమేశ్వరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం దయామణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యార్థులకు విద్యాకిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీవైఈవో నరసింహ ఫణి, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, కూటమి నేతలు శాకా కోటేశ్వరరావు,గరగ శ్రీరామకృష్ణ, శాకా శ్రీనివాస్, కడియాల వెంకటరమణ, కనకాల సత్యనారాయణ, అంబవరపు సత్యనారాయణ, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణ మూర్తి, వై.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సోమేశ్వరంలో స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

విద్యా వ్యవస్థ పటిష్టానికి కృషి: ఎమ్మెల్యే బండారు



రావులపాలెం: కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, జూలై18: విద్యావ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపించి విద్యార్థులు అన్ని రంగాల్లో నిలదొక్కుకునేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ఆయన రావులపాలెం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. వెదిరేశ్వరంలో క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారును సత్కరించారు. రావులపాలెంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, చిన్న కేవీలు స్వామివారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే పరమావధి

కొత్తపేట, జూలై 18: కూటమి ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్తే పరమావధి అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయిలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఎంఈవో ఎం.హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ మార్గన గంగాధర్, సర్పంచ్ బూసి జయలక్ష్మీభాస్కరరావు, టీడీపీ నాయకులు దర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, త్సామా బాబు, బీర ఇసాక్, వాసంశెట్టి సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వరరావు, మిద్దే ఆదినారాయణ, సలాది చిన్న, చింతం విజయకృష్ణమోహన్, బీర శ్రీనివాసరావు, ఎంఈవో-2 లీలావతి, రంకిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేతను ఆదుకుంటాం: ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, జూలై 18: చేనేత రంగాన్ని ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మోరి చేనేత సహకార సంఘాన్ని ఆయన సందర్శించారు.వస్త్ర నిల్వలు, సంఘ కార్యకలాపాలు, ఆర్థిక పరిస్థితిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంఘంలో రూ.53లక్షల వస్త్ర నిల్వలు పేరుకుపోయ్యాయని, గత ప్రభుత్వ విధానాలతో సంఘ సభ్యులు పనులు గిట్టుబాటుకాక ఇతర రంగాలకు వలస పోతున్నారని వివరించారు. గతంలో 30శాతం రిబేట్ అమ్మకాలు ఉండేవని, ఆవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, నూలు, రసాయనాలపై సబ్సిడీ ఇవ్వాలని చేనేత నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈవిషయాలన్నీ ప్రభుత్వానికి నివేదిస్తానని, చేనేత కార్మికుల పూర్వ వైభవానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, చేనేత నాయకులు కొండా శివయ్య, బూసిం చినబాబూరావు, బళ్ల లింగమూర్తి, కాశిన చిన్నా, జాన పార్వతీశం పాల్గొన్నారు.



మోరి చేనేత సొసైటీలో వస్త్రాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పి.గన్నవరం, జూలై 18: మహనీయుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ముంగండపాలెం శివారు ఆకుమర్తివారిపేటలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన బీఆర్ అంబేద్కర్, మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు జాతీయ నాయకులకు నివాళులర్పించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు,సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, చుట్టుగుళ్ల కిషోర్, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, నాగాబత్తుల సుబ్బారావు, చీకట్ల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బెల్లంతో తులాభారం

పి.గన్నవరం, జూలై 18: గిడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిస్తే పి.గన్నవరం అక్విడెక్టు వద్ద షిర్డిసాయి ఆలయంలో స్వామి వారికి బెల్లంతో తులాభారం ఇస్తానని ఆలయ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి మొక్కుకున్నారు. గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు బెల్లం తులాభారం నిర్వహించి ఆ బెల్లాన్ని ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, శిరి గినీడి వెంకటేశ్వరరావు, మట్టపర్తి రామకృష్ణ, వాసంశెట్టి కుమార్, నక్కా సత్యనారాయణ, గుడాల రామారావు, గుత్తుల రామకృష్ణ, కె.సత్యనారాయణరాజు, ఆరుమిల్లి సాయిబాబు, యడ్ల ఏసు, కడలి శంకరం, కర్రి బాబురావు, తాటికాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

మండపేట, జూలై18: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

రాజోలు, జూలై 18: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీపీ కేతా శ్రీను కోరారు. రాజోలు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, చింతలపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు స్టూడెంట్ కిట్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. కడలిలో మండల ప్రజాపరిషత్ పాఠశాలలో 20మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను రాజోలు నియోజకవర్గ తెలుగురైతు ఉపాధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్డి సత్యం, జడ్పీటీసీ మట్టా శైలజ, వడ్లమూడి ప్రకాష్, వడ్లమూడి చిన్నీ, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, వైస్‌ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు, ఎంఈవో ఎస్.మనోహరం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో రాష్ట్రం అగ్రగామి

రాజోలు, జూలై 18: అస్తవ్యస్తంగా మార్చిన ఈరాష్ట్రాన్ని కేవలం నెల రోజుల్లో గాడిలో పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు అన్నారు. పరిపాలనా దక్షత, అపార అనుభవంతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేసి దేశంలో అగ్రగామిగా నిలిపే సత్తా కేవలం చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

అల్లవరం, జూలై 18: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి 26వరకు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఆధార్, బాల ఆధార్ నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో కృష్ణమోహన్ కోరారు. పదేళ్ల క్రితం నమోదు చేసుకున్న వారు కూడా ఆధార్‌కార్డును అప్డేట్ చేయించుకోవాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, జూలై 18: గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కోరుమిల్లిలో లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల చొరవతో గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే వేగుళ్లకు గ్రామసర్పంచ్ ఆచంట సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ వై.విజయానంద్, డిప్యూటీ ఈఈ మురళీమోహన్, ఏఈ సాలెంరాజు, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు తుట్టపు నాగరాజు, సుంకర శ్రీనివాస్, సుంకర బుజ్జి, కొండిశెట్టి నాగేశ్వరరావు, వార్డు సభ్యులు వెలుగుబంటి ఏసుదాసు, వీరభద్రం, మోటుపల్లి బాపిరాజు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కోరుమిల్లిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించండి

ముమ్మిడివరం,జూలై18: ముమ్మిడివరం నగర పంచాయతీలోని పలువార్డుల్లో వీధికుక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పలువురు నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. వీధికుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని సీనియర్ సిటిజన్, విశ్రాంత హెచ్‌ఎం పి.డానియల్ ఆధ్వర్యంలో పలువురు కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్‌లకు వినతిపత్రాలు ఇచ్చారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

అంబాజీపేట, జూలై 18: కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి వి.గౌతమి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద కుష్ఠు వ్యాధి లక్షణాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మైకో బ్యాక్టీరియం ద్వారా ఈవ్యాధి వస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రత్నకుమారి, సీహెచ్‌వో అప్పారావు, సూపర్‌వైజర్ మధుబాబు, హెల్త్‌అసిస్టెంట్లు వి.మురళీ, జీవీవీకే ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.కిషోర్ పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఆకుల రాజా, సీహెచ్‌వో రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో నారాయణ విద్యార్థి ప్రతిభ

యానాం, జూలై18: పుదుచ్చేరిలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో యానాం నారాయణ విద్యార్థి ఎస్.అభిషిక్త్ ప్రతిభ చాటాడని హెచ్‌ఎం తెలిపారు.అమలాపురం జోనల్ ఓజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బలరాం మహంతి, కోఆర్డినేటర్ సుంకరమూర్తి, సెంటర్ కోచ్ ఉదయకుమార్ అభినందించారు.

ఫీల్డ్‌అసిస్టెంట్లు, మేట్లుగా స్థానికులే ఉండాలి

ఉప్పలగుప్తం, జూలై 18: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లుగా స్థానికులే ఉండాలని డ్వామా ఏపీడీ, డీపీవో డి.రాంబాబు సూచించారు. స్థానికేతరులను ప్రధానంగా కోడళ్లను మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని పేరాయిచెరువు వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీడీ విచారణ చేపట్టారు. వేరే ప్రాంతాల్లో ఉన్న వారిని ఉపాధి విధుల్లో నియమించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీవోను ఆదేశించారు. పెద్దూరు శ్మశానవాటిక అభివృద్ధి, ప్రహరీగోడ నిర్మాణంపై ఉపాధి సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవట్లేదన్న ఎంపీటీసీ తాళ్ల లక్ష్మీనరసాయమ్మ ఫిర్యాదుపై ఏపీడీ విచారించారు. ఈ పనికి గ్రామ పంచాయతీ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్, ఏపీవో రాజామణి, ఈవోపీఆర్డీ కేవీఎస్ గౌరీకుమారి, పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ దాడులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

అల్లవరం, జూలై18: నానాటికీ పెరుగుతున్న సైబర్ దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌పీ చంద్రమౌళి కోరారు. ఓడలరేవు బీవీసీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్‌విభాగం ఆధ్వర్యంలో 'ఎథికల్ హ్యాకింగ్' అంశంపై మూడు రోజుల జరిగే కార్యశాల గురువారం ప్రారంభమైంది. సైబర్ దాడులను నియంత్రించడానికి హ్యాకర్లు పాల్పడుతున్న పద్ధతులపై సున్నిత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. నాగసాయికిరణ్, డాక్టర్ బీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ కె.శివన్నారాయణ, డాక్టర్ ఎస్.శ్రీకాంత్, వైవీ రమణమూర్తి, డాక్టర్ ఎ.ప్రవీణ్, ఎ.దుర్గామాధురి, ఆకుల ఏసుప్రసాద్ పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి సొమ్ము కాజేసి..

మామిడికుదురు, జూలై 18: మామిడికుదురుకు చెందిన రజా హుస్సేన్ బుధవారం మామిడికుదురులోని ఏటీఎం సెంటర్‌లో రూ.10వేలు తీసుకున్నాడు. ఏటీఎం సెంటర్‌లో ఉండి అతడిని గమనించిన గుర్తుతెలియని వ్యక్తి ఏటీఎం కార్డు మార్చి వేరే కార్డును హుస్సేన్‌కు ఇచ్చాడు. బాధితుడు గురువారం బ్యాంకుకు వెళ్లగా ఖాతాలో సొమ్ము లేదని అధికారులు చెప్పగా అప్పుడు ఏటీఎం కార్డు చూసి కార్డు మారిందని గ్రహించాడు. పాశర్లపూడి ఏటీఎం సెంటర్‌లోను, పెట్రోల్ బంకు, వివిధ చోట్ల మొత్తం రూ.40,600 డ్రా చేసినట్టు బ్యాంకు అధికారులు తెలిపారు. పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

కళాశాలపై కేసును ఉపసంహరించుకున్న విద్యార్థులు

మలికిపురం, జూలై 18: మలికిపురం ఏఎస్‌డీటీ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఫీజులు మాత్రమే వసూలు చేయాలని కోరుతూ ఆ కళాశాల విద్యార్థులు కొత్తపల్లి వీరమణికంఠ, తోట నవీన్, ఎంహెచ్ నాగవెంకటసతీష్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులతో తక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో కళాశాలపై ఆర్థికభారం పడి అందులో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి కనీస జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో కొంతమంది అధ్యాపకులు, సిబ్బంది కళాశాల నుంచి ఇతర కళాశాలలకు వెళ్లిపోతున్నారు. దీంతో కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆలోచనతో కళాశాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో తాము వేసిన కేసును ఉపసంహరించుకున్నట్టు విద్యార్థులు తెలిపారు.


బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడికి ముస్లింల సత్కారం

కొత్తపేట, జూలై 18: కొత్తపేట మండల బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దెందులూరి జగదీశ్వరప్రసాద్‌ను స్థానిక జామియా మసీదులో ముస్లిం పెద్దలు దుశ్శాలువాతో సత్కరించారు. ఉపాధ్యక్షుడు వేమవరపు రామకృష్ణ, కోశాధికారి కీర్తి సత్యనారాయణమూర్తిలను పూలమాలలతో సత్కరించారు. హిందు, ముస్లింలు భాయిబాయి అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ గౌస్, షేక్ ఖాజాబాబు, ఎండీ ఖాజామొహిద్దీన్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ

మండపేట, జూలై 18: స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కాళ్లకూరి స్వరాజ్యభవాని, శెట్టి కళ్యాణి, గ్రంధి శ్రీనివాస్, మండపల్లి రవికుమార్ హెచ్‌ఎం వి.విసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిజిక్స్‌లో శ్రీమన్నారాయణకు డాక్టరేట్



ముమ్మిడివరం, జూలై 18: గేదెల్లంక గ్రామానికి చెందిన కోలా శ్రీమన్నారాయణ నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తోన్నారు. మెటీరియల్ సైన్స్‌లో బేరియం, కాల్షియం, జిర్కోనియం, టిటనైట్‌లో, స్ట్రాన్షియం ఆక్సైడ్, సిరియం ఆక్సైడ్‌ల ప్రతిక్షాపనల పనితీరుపై చేసిన పరిశోధనలకు విశాఖలోని గీతం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ(డిగ్రీ) ప్రదానం చేసింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య, సహ అధ్యాపకుడు పి.జాన్‌కిరణ్, సహ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఓంజీ
శ్రీలలిత	:సారంగ దరియా
శేఖర్ స్క్రీన్-1	: కల్కి
శేఖర్ స్క్రీన్-2	: ---
రమా	: భారతీయుడు 2
గణపతి	:రౌడీ గ్యాంగ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ---

మారుతీ మహరాజ్ కైవల్యం



అయినవిల్లి, జూలై 18: మాగాం గ్రామంలో ఆశ్రమం ఏర్పాటుచేసి ప్రజల్లో ఆధ్యాత్మిక తత్వాన్ని పెంపొందించిన శ్రీమారుతీ చరణ్ మహరాజ్ కైవల్యం పొందారు. ఏకాదశి తిథిలో రామ నామాన్ని స్మరిస్తూ కైవల్యం పొందారని భక్తులు తెలిపారు. మారుతీ మహరాజ్ 124 రోజులు శ్రీరామ జయరామ జయజయ రామ నామాన్ని కోటి 98సార్లు జపయజ్ఞం, సుందరకాండ పారాయణం యజ్ఞాలు నిర్వహించారు. గురువారం భక్తుల ఆధ్వర్యంలో స్వామిశిష్య బృందం రామ నామాన్ని జపిస్తూ ఆశ్రమంలో మహారాజ్‌ను సమాధి చేశారు.

కౌలు రుణాలపై అవగాహన

కపిలేశ్వరపురం, జూలై 18: టేకి రైతు సేవా కేంద్రం వద్ద గురువారం యూనియన్ బ్యాంక్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలురైతులకు రుణాలు, నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ కుమార్, వ్యవసాయ శాఖాధికారి రమేష్‌కుమార్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డుపై ఓనర్ సంతకం ఉంటేనే రుణం మంజూరవుతుందన్నారు. వ్యవసాయసహాయకుడు హరిబాబు, దాసరి శ్రీనివాస్, మేడిశెట్టి వెంకటరమణ, ఎం.శ్రీనివాస్, వి.సతీష్, పి.గణేశ్వరరావు, పాల్గొన్నారు.

శారదాదేవికి సారె సమర్పణ

యానాం, జూలై 18: స్థానిక గోపాల్‌నగర్‌లో ఉన్న శారదాదేవి ఆలయంలో అమ్మవారికి గురువారం స్థానిక నల్లచెరువు నుంచి సన్నాయిమేళాంతో సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వంతో ఎంతో మేలు



రాజోలులో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, జూలై 18: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రతీ ఒక్కరికీ ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు వనువులమ్మ ఆలయం వద్ద జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కోళ్ల బాబి, కుంపట్ల చిన్నారి, ఉండపల్లి అంజి, కాట్న రాజు, పినిశెట్టిబుజ్జి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగరలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల28 వరకు సభ్యత నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలికిపురం: జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మలికిపురం సెంటర్‌లోని వినాయకుని ఆలయం వద్ద సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు ఆధ్వర్యంలో మొదటి సభ్యత్వాన్ని పళ్లపోతు విస్సుబాబుకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అందజేశారు. ప్రమాదం జరిగితే రూ.50వేలు, దురదృష్టవశాత్తు ప్రాణనష్టం జరిగితే రూ.5లక్షలు బీమా సదుపాయం పార్టీ కల్పిస్తుందన్నారు.పార్టీమండల అధ్యక్షుడు మల్లిపూడి సత్తిబాబు, గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, పినిశెట్టి బుజ్జి, మాజీ ఎంపీపీ గుండుబోగుల గంగాభవానీ, గెడ్డం మహలక్ష్మీప్రసాద్, ఉండపల్లి అంజి పాల్గొన్నారు.

అంతర్వేది: ప్రతీ కార్యకర్తకు బీమా భరోసా కల్పించే విధంగా క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం వీవీమెరక గ్రామంలో ఓదూరి రాజా ఇంటి వద్ద ఏర్పాటుచేసిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండల అధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, మండల జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

కె.గంగవరం: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం కూళ్లలో ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ కూళ్లలో పలివెల శ్రీనివాసరావు, మల్లి వీరేంద్రలకు సభ్యత్వాలు అందజేశారు. రూ.500 చెల్లించి రశీదు తీసుకున్నారు. పార్టీ నాయకులు దేవరపల్లి చక్రి, సత్యనారాయణ, కోటిపల్లి వీర వరప్రసాద్, సలాది జానకిరామ్ పాల్గొన్నారు.

ప్రమాదాల్లో హెల్మెట్‌తో పునర్జన్మ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 18: ప్రమాదాలు సంభవించిన సందర్భంలో హెల్మెట్ పునర్జన్మను ప్రసాదిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రామచంద్రపురంలో మండల లోక్‌అదాలత్ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది హెల్మెట్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి, ఏజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వికాస డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి.. హత్య కేసు నమోదు

కపిలేశ్వరపురం, జూలై 18: అంగర పోలీస్ స్టేషన్‌లో గురువారం హత్యకేసు నమోదైంది. ఎస్ఐ పరదేశి వివరాలు ప్రకారం... అంగర గ్రామానికి చెందిన సున్నా నరేష్(38) ఈనెల 15న ఎన్టీఆర్ కాలనీలోని ఇంటి గదిలో మృతిచెంది ఉన్నాడు. మతిస్థిమితం లేని నరేష్ ఆ ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. అంధురాలు అయిన అతడి భార్య కుసుమప్రసన్న మూడేళ్లుగా తన కుమార్తెతో కలిసి కొత్తపేట మండలం వాడపాలెంలోని తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటుంది. నరేష్ మృతితో అతడి భార్య కుసుమప్రసన్న, మామ బండారు వెంకటేశ్వరరావు 16న ఘటనా స్థలానికి చేరుకున్నారు. దహన సంస్కారాలు అనంతరం అత్తమామలు అతడి గదిలో రక్తపు మరకలను గమనించారు. దీంతో గురువారం తన అల్లుడిని ఎవరో హత్య చేసినట్లు మామ వెంకటేశ్వరరావు అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ శ్రీధర్ గురువారం అతడి ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. ఎస్ఐ పరదేశి హత్యకేసుగా నమోదు చేశారు. ఇంటి పరిసరాలను డాగ్‌స్క్వాడ్ పరిశీలించింది. రక్తపు మరకలను గుర్తించిన పోలీసులు హత్య కేసుగా నమోదు చేసినట్టు, త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు.

పీడీ పోస్టులు పునరుద్ధరించాలి

అంతర్వేది, జూలై18: గత ప్రభుత్వంలో జీవో 117తో 3,4,5 తరగతులను హైస్కూలులో కలిపి జీహెచ్ఎంఎస్, పీడీ పోస్టులు రద్దు చేశారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. పలు హైస్కూళ్లలో పోస్టులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈపోస్టులను వెంటనే పునరుద్ధరించాలని విద్య శాఖా మంత్రి లోకేశ్‌కు మెయిల్‌ద్వారా విజ్ఞప్తి చేశానన్నారు.

ఉపాధి కల్పనలో జిల్లా ఫస్ట్ ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం, జూలై18: ఈఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2,73,826 పని దినాలకల్పన ద్వారా ఉప్పలగుప్తం మండలం కోనసీమ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు డ్వామా ఏపీడీ, డీపీవో డి.రాంబాబు తెలిపారు. గురువారం ఆయన ఉప్పలగుప్తంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉపాధి హామీ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంలో ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు, సిబ్బంది తగిన విధంగా పని చేస్తున్నారన్నారు.

ఆగస్టు 22న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు

మండపేట, జూలై18: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 22,23 తేదీల్లో స్మార్ట్ మెటీరియల్ ఇంటర్‌నేషనల్ సదస్సు నిర్వహిస్తారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు సారధ్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సదస్సు బ్రోచర్లను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆవిష్కరించారు. కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని వేగుళ్ల చెప్పారు. అధ్యాపకులు కె.కిరణ్ కుమార్, నెహ్రూనాయక్, గోపాలకృష్ణ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రాజోలు ఎమ్మెల్యేను సన్మానించిన నామన

మామిడికుదురు, జూలై 18: మగటపల్లి గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యేను జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు దుశ్శాలువాలతో సన్మానించి మొక్కను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బొలిశెట్టి జయరామ్, దొడ్డా జయరామ్, కుంపట్ల బాబి, మానేపల్లి రామకృష్ణ, కట్టా రాజు, నామన నాగేశ్వరరావు, బొలిశెట్టి నాగభూషణం, కుంచే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య కలెక్టర్ దృష్టికి

మలికిపురం, జూలై18: రాజోలు నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజల జీవన పరిస్థితులు దెబ్బతింటున్నాయని కలెక్టర్‌కు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ లేఖ రాశారు. సీఎస్సార్ నిధులు కేటాయించి అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయిన్ డ్రెడ్జింగ్‌కు చేయూతనివ్వాలని కోరారు. ఈడ్రెయిన్ల డ్రెడ్జింగ్ నిమిత్తం రూ.10.58కోట్లు సీఎస్ఆర్ నిధులు విడుదల చేయాలన్నారు.